క్లుప్తంగా

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి: సీపీఐ నేత



మాట్లాడుతున్న మల్లేశ్

హుస్నాబాద్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ తరఫున పోటీచేసి ఎక్కువ స్థానాలు కైవసం చేసుకోవాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని అనబేరి, సింగిరెడ్డి అమరుల భవన్‌లో ఆదివారం పార్టీ మండల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం గ్రామ కార్యదర్శులు, మండల నాయకులు నిర్విరామంగా పని చేయాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు జాగీర్ సత్యనారాయణ, నాయకులు కుమారస్వామి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాచగిరీశుడికి ఎమ్మెల్సీ పూజలు


నాచగిరీశుని దర్శించుకుంటున్న యాదవరెడ్డి

వర్గల్(గజ్వేల్): నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రాన్ని మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ఆదివారం సందర్శించారు. ఆలయ పండితులు ఆయనకు స్వాగతించి శేషవస్త్రంతో సన్మానించారు. స్వామివారికి విశేషపూజలు జరిపించారు. తీర్థప్రసాదాలు, స్వామివారి ఆశీస్సులు అందజేశారు. ఆదివారం సెలవురోజు కావడంతో క్షేత్రంలో భక్తుల సందడి నెలకొన్నది.

రేబిస్‌తో అప్రమత్తం


కుక్కపిల్లలకు టీకాలు వేస్తున్న వైద్యులు

గజ్వేల్‌రూరల్: రేబిస్ ప్రాణాంతకమైన వ్యాధని, కుక్కలతో అప్రమత్తంగా ఉండాలని అదనపు సీపీ ముత్యంరాజు, వెటర్నరీ ఏడీ డాక్టర్ రమేశ్ సూచించారు. పంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక పశువైద్యశాలలో కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కుక్కలు, పిల్లులు కరవడం ద్వారా రేబిస్ సోకే అవకాశముందన్నారు. వాటికి టీకాలు వేయడం ద్వారా ఈ వ్యాధిని నిర్మూలించవచ్చని చెప్పారు. సిబ్బంది షకీల్, హజి తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న స్నేహితులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి హైస్కూల్లో 1996–97 బ్యాచ్ పదో తరగతికి చెందిన స్నేహితులు తోటి మిత్రుడి కుటుంబానికి రూ.71,500 అందజేసి అండగా నిలిచారు. కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లికి చెందిన ఎర్రం బాలు ఇటీవల మృతి చెందాడు. దీంతో పూర్వవిద్యార్థులు ఆదివారం ఆ కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. పిల్లల చదువుల కోసం ఆర్థిక సహాయం అందజేస్తామని భరోసా నిచ్చారు.

నూతనంగా ఎంపికైన ఎంపీడీఓకు సన్మానం


ప్రవీణ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కోహెడరూరల్(హుస్నాబాద్): ఇటీవల విడుదలైన గ్రూప్–1 ఫలితాల్లో ఎంపీడీఓగా ఎంపికైన బానోత్ ప్రవీణ్ నాయక్‌ను ఘనంగా సన్మానించారు. మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన ఆయనను గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆదివారం అభినందించారు.

స్థానిక ఎన్నికలపై ఉత్కంఠ

బెజ్జంకి(సిద్దిపేట): సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై మండల నాయకులలో ఉత్కంఠ మొదలైంది. పలువురు మాజీ ప్రజాప్రతినిధులకు ఆయా గ్రామాలలో రిజర్వేషన్‌లు కలిసి రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఎంపీపీ జనరల్ మహిళ, జెడ్పీటీసీ జనరల్ స్థానాలు కావడంతో రాజకీయ నేతలలో హడావుడి పెరిగింది. ఎన్నికలు ఎప్పుడు వస్తాయోనని అనుమానాలు వ్యక్తం చేస్తూనే బరిలో నిలిచే నాయకులపై చర్చించుకుంటున్నారు. అన్ని ప్రధాన పార్టీలలో నాయకుల ఎంపికపై జోరుగా చర్చ సాగుతోంది. ఆశావహుల సంఖ్య అదే స్థాయిలో పెరుగుతుండటం గమనార్హం.

బంతిపూలతోనే బతుకమ్మలు

కానరాని గునుగు
- పూత లేని తంగేడు
- జాడ లేని గుమ్మడి పువ్వులు

మిరుదొడ్డి(దుబ్బాక)/దుబ్బాక: బతుకమ్మల పేరు వినగానే ముందుగా టక్కున గుర్తుకు వచ్చేది గునుగు, తంగేడు పూలు. కానీ పండుగ నేపథ్యంలో బతుకమ్మలను పేర్చడానికి గునుగు పూలు కానరావడం లేదు. తంగేడు పూతలు అసలే లేవు. బతుకమ్మలో ఒదిగి పోవాల్సిన గుమ్మడి పూల జాడే లేదు. వర్షాకాలం వచ్చిందంటే చాలు పొలాలు, మొక్కజొన్న ఇతర మెట్ట పంటల్లో, చెలకల్లో, బీడు భూముల్లో ఎక్కడ చూసినా దర్శనమిచ్చేది. ప్రస్తుతం వ్యవసాయరంగంలో వచ్చిన మార్పుల్లో భాగంగా రైతులు కలుపు నివారణకు గడ్డి మందులు స్ప్రే చేస్తున్నారు. దీంతో గనుగపువ్వు అంతరించిపోతోంది. అరుదుగా మాత్రమే కనిపిస్తోంది. మార్కెట్‌లో కట్ట పువ్వులకు రూ.50కి పైగా ధరపలుకుతోంది. దీంతో మార్కెట్లో విరివిగా లభించే


గునుగపువ్వు కోసం చెలకల్లో తిరుగుతున్న జనం


బంతి పూలను విక్రయిస్తున్న మహిళలు


గునుగు పూలు


ఏపుగా పూచిన బంతిపూలు


తంగేడు పూలు

బంతి పూల కోసం జనాలు మొగ్గు చూపిస్తున్నారు. పల్లెల్లో కిలో బంతి పూలకు రూ. 80 నుంచి రూ. 100కు విక్రయిస్తుండగా పట్టణాల్లో రూ. 180 నుంచి రూ. 200 వరకు ధర పలుకుతోంది. అలాగే గుమ్మడి, బీర పూలు సైతం కానరాకుండా పోయాయి. చేసేది లేక బంతిపూలతోనే బతుకమ్మలను పేర్చడానికి మహిళలు సిద్ధమవుతున్నారు.

తంగేడు పూలు దొరుకుతలేవు..



బీడు భూముల్లో విరివిగా దొరికే తంగేడు పూలు ఇప్పుడు దొరుకుతలేవు. చిన్న బతుకమ్మలను పేర్వనీకి తంగేడు పూల కోసం జనాలు రెమ్మలను విరిచేయడంతో అవి పూయడం కష్టంగా మారింది. దీంతో తంగేడు పూలు దొరుకుడే కరువైంది. గునుగు దొరకకపోవడంతో తప్పని పరిస్థితుల్లో బంతి పూలను కొనుగోలు చేసి బతుకమ్మలను పేర్చాల్సి వస్తోంది.

– సూకూరి లక్ష్మి, అందె

బంతి పూలతో ఉపాధి



ఎకరం పొలంలో బంతి సాగు చేసినం. పండుగ సందర్భంగా బంతి పూలను మార్కెట్లో విక్రయిస్తున్న. పంట పొలాలల్లో గునుగు, తంగేడు పూలు దొరుకుత లేదని బంతిపూలను కొనుక్క పోతున్నరు. బంతి పూలకు గిరాకీ పెరగటంతో మంచి ఉపాధి దొరుకుతుంది.

– కళవ్వ, మహిళా రైతు, మిరుదొడ్డి

గడ్డిమందుల ప్రభావం వల్లే కొరత



ఎక్కడ పడితే అక్కడ కనిపించే గునుగ పువ్విప్పుడు చూద్దామన్నా కనబడడం లేదు..పంట చేలలో కలుపునివారణకు రైతులు గడ్డి మందులు చల్లుతుండడంతో గునుగ నశించిపోతుంది.భవిష్యత్తులో గునుగపువ్వు జాడకే ప్రమాదంఏర్పడేటట్టు కనిపిస్తుంది.గునుగ పువ్వు అంతరించిపోకుండా మనమందరం కాపాడుకోవాల్సిన భాద్యత ఎంతైన ఉంది.

– గన్నె వనితభూంరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, దుబ్బాక

కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమం

మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్

తొగుట(దుబ్బాక)/మిరుదొడ్డి(దుబ్బాక)/దౌల్తాబాద్(దుబ్బాక): కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమం జరిగిందని మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ అన్నారు. దసరా పండుగ సందర్భంగా ఆయన వివిధ గ్రామాల్లో పేదలకు ఆదివారం నూతన దుస్తులు అందజేశారు. తొగుట మండల పరిధిలోని వెంకట్రావుపేటలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రామ్‌రెడ్డితో కలిసి గ్రామస్తులకు వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సీఎం అయిన తర్వాతనే సాగునీరు, విద్యుత్ అందాయన్నారు. కార్యక్రమంలో నాయకులు పెంటోజీ, స్వామిగౌడ్, వెంకటయ్య, రాజు, పరశురాములు, స్వామి, లక్ష్మణ్, నర్సింహారెడ్డి, జహంగీర్, రాంబాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మిరుదొడ్డి మండలంలోని లింగుపల్లి, దౌల్తాబాద్ మండల పరిధిలోని గాజులపల్లి, లింగాయపల్లితండాలోను


తొగుట(దుబ్బాక): వెంకట్రావుపేట గ్రామస్తులకు దుస్తులు అందజేస్తున్న ఫారూఖ్ హుస్సేన్

వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఆయాన మాట్లాడుతూ పండుగలను సంతోషంగా జరుపుకోవాలన్న ఉద్దేశ్యంతోనే పేదలకు దుస్తులు అందజేస్తున్నానన్నారు. తనకు రాజకీయ భిక్షపెట్టిన నాటి దొమ్మాట, నేటి దుబ్బాక ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమాలలో నాయకులు అంజిరెడ్డి, బాల్‌నర్సయ్య, ఎండీ అహ్మద్, స్వామి, మల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ విద్యుత్ తేజం భగత్‌సింగ్


సిద్దిపేటలో భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

డీటీఎఫ్, యూఎస్‌ఎఫ్‌ఐ నేతలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారత స్వతంత్ర సమర యోధుడు, యువతలో స్ఫూర్తి నింపిన విద్యుత్ తేజం షహీద్ భగత్‌సింగ్ అని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్, యూఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు ప్రశంసించారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఆదివారం సిద్దిపేటలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయసులోనే ఉరితాడును ముద్దాడిన వీరుడన్నారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదంతో యువతలో చిరస్మరణీయంగా నిలిచిపోయాడని కొనియాడారు. భగత్‌సింగ్ జయంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘాల నాయకులు చంద్రభాను, మల్లయ్య, మనీష్‌కుమార్, సత్తయ్య, దివాకర్, రవి, రవి, మణికంఠ, వరుణ్, హేమంత్, సాయికిషోర్, బాను తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ సంఘం నాయకులు మహేశ్, మహేందర్, రూపేష్, శ్రవణ్, లక్ష్మణ్, చరణ్, సంపత్, మల్లేశం, అమర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాషువా జయంతి వేడుకలు

మిరుదొడ్డి(దుబ్బాక): కేవీపీఎస్ ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి వేడుకలను అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శాతరాశి శ్రీనివాస్, కేవీపీఎస్ మండల కార్యదర్శి భక్తి తోటయ్య, సీపీఎం మండల గౌరవ అధ్యక్షుడు కూతురుస్వామి, మండల కార్యదర్శి లింగంపేట ఎల్లం, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి కుమారస్వామి, హమాలీ సంఘం అధ్యక్షుడు ఇంద్రం,


నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

కోశాధికారి రమేశ్, వాయిద్య కళాకారుల బృందం అధ్యక్షుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సమరసతకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి

వర్గల్(గజ్వేల్)/హుస్నాబాద్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో విజయ దశమి ఉత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వర్గల్ మండలం అనంతగిరిపల్లిలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆ శాఖ జిల్లా భౌతిక్ ప్రముఖ్ సానా ప్రసాద్ మాట్లాడారు. హైందవ ధర్మం, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ, సామాజిక సమరసతకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తోందన్నారు. 1925 విజయదశమి రోజున స్థాపితమైన ఆర్‌ఎస్‌ఎస్ ఈ దసరాతో వందేళ్లు పూర్తిచేసుకోబోతున్నదన్నారు. కార్యక్రమంలో బాబూరావు, శ్రీకాంత్, అంజయ్య, సత్యనారాయణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే హుస్నాబాద్‌లోని వీఎల్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విజయ దశమి ఉత్సవాలలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య పాల్గొన్నారు. ప్రధాన వక్తగా ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సహ కార్యవాహ తిరుపతి మాట్లాడారు. సర్వేజనా సుఖినో భవంత్ అని కోరే మన ధర్మం సాటిలేదని దన్నారు. కార్యక్రమంలో దేవేందర్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్, అశోక్, వెంకట్‌రెడ్డి, వీరారెడ్డి, సత్యనారాయణ, శంకర్, మోహన్‌రెడ్డి, శంకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


వర్గల్(గజ్వేల్): అనంతగిరిపల్లి ఉత్సవాల్లో పాల్గొన్న కార్యకర్తలు

30న 'అక్షర సేద్యం' దశమ వార్షికోత్సవం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాకు చెందిన అక్షర సేద్యం ఫౌండేషన్ దశమ వార్షికోత్సవం ఈ నెల 30న నంగునూరు మండలం ముండ్రాయి గ్రామంలో నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు దుర్గయ్య, వేల్పుల రాజు ఆదివారం తెలిపారు. అదేవిధంగా సామాజిక కార్యకర్త పులిరాజు 'దాపటిద్దు', బాల సాహితీవేత్త గరిపెల్లి అశోక్ 'అరుగుబడి' పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అతిథులుగా గొట్టిపర్తి రామస్వామి, పర్కపెల్లి యాదగిరి, పెండోట వెంకటేశ్వర్లు, వర్కోలు రాజలింగం, తోరటి రఘురంజన్, ఓగులం రాజిరెడ్డి, గుజ్జు అశోక్ కుమార్ హాజరుకానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కవులు, రచయితలు, సాహితీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పేద కుటుంబానికి 'చెలిమి' చేయూత

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన గంద్ర నరేందర్ మూడు నెలల క్రితం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో భార్య, ముగ్గురు పిల్లలు అనాథలుగా మారడంతో ఆదివారం చెలిమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుటుంబానికి నిత్యావసర సరుకులతోపాటు రూ.12 వేలు నగదు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కిరణ్, శ్రీనివాస్, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, సుభాష్, తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీప్రసన్ననగర్ కాలనీ కార్యవర్గం ఎన్నిక

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీప్రసన్ననగర్ కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోల రాజు, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, కోశాధికారిగా మంద శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా దుంబాల తిరుపతిరెడ్డి ఎన్నికయ్యారు. వారితోపాటు మరో 15 మందిని డైరెక్టర్లుగా, మరో ఆరుగురిని సలహాదారులుగా ఎన్నుకున్నారు.

తహసీల్దార్‌ల బాధ్యతల స్వీకరణ

కొండపాక(గజ్వేల్)/అక్కన్నపేట(హుస్నాబాద్)/నంగునూరు(సిద్దిపేట)/తొగుట(దుబ్బాక): కొండపాక తహసీల్దార్‌గా నోముల మల్లికార్జున్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు పని చేసిన ఎర్రోళ్ల శ్యాం బదిలీపై అక్బర్‌పేట్(భూంపల్లి) తహసీల్దార్‌గా వెళ్లారు. అ క్బర్‌పేట్(భూంపల్లి) తహసీల్దార్‌గా పనిచేసిన మల్లికార్జున్‌రెడ్డి కొండపాక తహసీల్దార్‌గా బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారం కోసం నేరుగా తమను సంప్రదించవచ్చన్నారు. అలాగే అక్కన్నపేట తహసీల్దార్ అనంతరెడ్డి బదిలీ అయ్యారు. అతని స్థానంలో దూల్మిట్ట తహసీల్దార్ సింహాచలం మధుసూదన్‌ను అక్కన్నపేట బదిలీ చేస్తూ ఆదివారం జిల్లా కలెక్టర్ హైమావతి ఉత్వర్వులను జారీ చేశారు. అనంతరెడ్డి కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లారు. నంగునూరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నారాయణరావుపేట డిప్యూటీ తహసీల్దార్ పసుపులేటి మాధవి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన సరిత మర్కూక్‌కు బదిలీపై వెళ్లారు. అలాగే తొగుట తహశీల్దార్‌గా పనిచేసిన శ్రీకాంత్ బెజ్జంకి తహసీల్దార్‌గా బదిలీపై వెళ్ళారు. కొహెడ తహసీల్దార్‌గా పనిచేసిన ఎండీ సమీర్ అహ్మద్ ఖాన్ తొగుట తహసీల్దార్‌గా తొగుటకు బదిలీపై రానున్నారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు


కొత్తగా నిర్మించిన బతుకమ్మ ఘాట్

హాజరుకానున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్: సద్దుల బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధమైంది. పట్టణంలో 29న బతుకమ్మ వేడుకలు జరిపేందుకు నిర్ణయించారు. దీంతో స్థానిక ఎల్లమ్మ చెరువుకట్టపై బతుకమ్మ సంబరాలు జరుపుకునేందుకు మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. వేడుకలకు దాదాపు 20 వేల మంది హాజరుకానున్నట్లు అధికారులు అంచనా వేశారు. వేడుకల సందర్భంగా బతుకమ్మ ఆట ఆడేందుకు ఇబ్బందులు లేకుండా దాదాపు 1200 ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేస్తున్నారు. బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు కట్టపై రెండు చోట్ల ప్రత్యేకంగా బతుకమ్మ ఘాట్‌లు నిర్మించారు. కట్ట కింది భాగంలో బతుకమ్మ ఆడేందుకు స్థలాన్ని చదును చేశారు. చెరువు కట్టకు వచ్చే వాహనాల పార్కింగ్ కోసం ఎల్లమ్మ దేవాలయం, పశువుల అంగడి వద్ద ఏర్పాట్లు చేసినట్లు ఏసీపీ సదానందం, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు. సంబురాల్లో మంత్రి పొన్నం పాల్గొంటారని చెప్పారు.

మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కొమ్మూరి తదితరులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వీరన్నపేటలో మాజీ ఎంపీటీసీ ఆరెళ్ల పాపయ్యగౌడ్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన నాయకులు వెంట కొమ్ము రవి, దాసరి శ్రీకాంత్, మంజె మల్లేశం, రంగు శివశంకర్ తదితరులున్నారు. అనంతరం మండల పరిధిలోని వీరన్నపేటకు చెందిన ఇరగదిండ్ల కనకయ్యకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసరాల పంపిణీ


నిత్యవసరాలను అందజేస్తున్న రియాజొద్దిన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా 20వ వార్డు కౌన్సిలర్ రియాజొద్దిన్, స్థానిక మున్సిపల్ కార్మికులకు ఆదివారం నిత్యవసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలంతా సంతోషంగా పండుగలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మున్నా, నవీద్, రహీం, సలీం తదితరులు పాల్గొన్నారు.

ముస్త్యాల గ్రామంలో..

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ముస్త్యాల గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులకు మాజీ సర్పంచ్ పెడతల యెల్లారెడ్డి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేస్తూ ప్రజల ఆరోగ్య రక్షణకు కృషిచేస్తున్న కార్మికులు సంతోషంగా పండుగలు చేసుకోవాలన్నారు. ఆయనకు సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

గుంతలు పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్..

నంగునూరు(సిద్దిపేట): పాలమాకుల ఊరచెరువు రోడ్డులో ఏర్పడిన గుంతలను అధికారులు పూడ్చివేయించారు. 'రోడ్డు ఇలా.. నిమజ్జనం ఎలా?' అని ఆదివారం సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పాలమాకులలోని ఊర చెరువుకట్ట రోడ్డులో గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో పంచాయతీ సిబ్బంది గుంతలను పూడ్చివేసి ఎర్రమట్టితో రోడ్డు వెడల్పు చేశారు. చెరువుకు వెళ్లే దారి, బతుకమ్మ నిమజ్జన స్థలాన్ని చదును చేశారు.


గుంతలను పూడ్చివేసి వెడల్పు చేసిన ఊర చెరువు కట్ట రోడ్డు

మహాచండీ.. పాహిమాం

దేవీనవరాత్రి ఉత్సవాలు సందడిగా కొనసాగుతున్నాయి. ఆదివారం అమ్మవారు మహాచండీగా దర్శనమిచ్చారు. దుర్గామాత మండపాలు, ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు మహిళలతో సామూహిక కుంకుమార్చనలు చేయించారు.


తొగుట(దుబ్బాక): కాన్గల్‌లో కుంకుమార్చన..


నంగునూరు(సిద్దిపేట): కుంకుమార్చన చేస్తున్న మహిళలు


బెజ్జంకి నవ యువ యూత్ ఆధ్వర్యంలో పూజలు


మిరుదొడ్డి(దుబ్బాక): మోతెలో మహాకాళి అవతారంలో అమ్మవారు


చిన్నకోడూరు(సిద్దిపేట): గోనెపల్లిలో ..